కృష్ణాష్టమి వేడుకలకు సర్వం సిద్ధం

- విద్యుత్ కాంతులు, స్వాగత వేదికలతో వెలుగులు జిమ్ముతున్న ప్రధాన రహదారి
- ఈ నెల 27న మారేడ్‌పల్లిలో వేడుకలు
- నేటి నుంచి సీతాఫల్‌మండిలో..

మారేడ్‌పల్లిలో విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన స్వాగత వేదికలు, దేవతామూర్తుల ఫొటోలు

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 25: మారేడ్‌పల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. విద్యుత్ కాంతులతో స్వాగత వేదికలు, దేవతామూర్తుల ఫొటోలతో ప్రధాన రహదారి విద్యుత్ లైట్లతో వెలుగులు విరజిమ్ముతున్నాయి. కంటోన్మెంట్ యాదవ సంఘం అధ్యక్షుడు చిర్రబోయిన సంతోష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 27న జరిగే వేడుకలకు ఏర్పాట్లు చేశారు. మహారాష్ట్ర, పుణే, గుంటూరు, తెనాలి నుంచి కళాకారులు పాల్గొని సందడి చేయనున్నారు. మారేడ్‌పల్లిలోని తన నివాసంలో 27న పూజ జరుగనుందని ఆయన వెల్లడించారు. వేడుకలకు పలువురు రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నట్లు సంతోష్ తెలిపారు.

సీతాఫల్‌మండిలో నేటి నుంచి..

సికింద్రాబాద్, ఆగస్టు 25: సీతాఫల్‌మండిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని త్రీస్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ చైర్మన్ చెన్నయ్యగౌడ్, అధ్యక్షుడు కృష్ణ ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. 42 ఏండ్లుగా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు మూడు రోజులు నిర్వహిస్తున్నట్టు వారు వెల్లడించారు. ఉట్టి కొట్టే వేడుకను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కీసర, ఆగస్టు 25: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..కీసరకు చెందిన సాయికుమార్ రెండు రోజుల క్రితం అదృశ్యమయ్యాడంటూ కీసర పోలీసుస్టేషన్‌లో అతని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులకు ఆదివారం భోగారంలోని ఓ చెరువులో సాయికుమార్ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని స్థానికుల సహాయంతో చెరువులోంచి బయటకు తీసి మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి

మాదాపూర్, ఆగస్టు 25: బస్తీ సమస్యలపై సమీక్ష జరిపి.. అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఇజ్జత్ నగర్ వీకర్ సెక్షన్ బస్తీలో ఆదివారం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం బస్తీలోని శ్మశాన వాటిక పనులను స్థానికులతో కలిసి చర్చించారు. దీంతో స్థానిక ప్రజలు శ్మశాన వాటికలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ నూతన అధ్యక్షుడు కృష్ణ నాయక్, గౌరవ అధ్యక్షుడు నీలం బ్రహ్మయ్య యాదవ్, గౌరవ సలహాదారు తలారి కేశవులు, రామచందర్ యాదవ్, ఉపాధ్యక్షులు కృష్ణ ముదిరాజ్, చింతల తిరుపతయ్య, జెట్టి హుస్సేన్, రజనీకాంత్, రమేశ్‌నాయక్, చందు, చెన్నకేశవులు, నాగులు ఉన్నారు.

నిందితులను శిక్షించాలి

మైలార్‌దేవ్‌పల్లి: కోల్‌కతా ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బుద్వేల్ రైల్వేస్టేషన్ వద్ద నిరసనగా కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు.

గణపతి ఆలయ అభివృద్ధికి కృషి

మారేడ్‌పల్లిలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ పాలక మండలి చైర్మన్ సత్యనారాయణ, సభ్యులు

మారేడ్‌పల్లి, ఆగస్టు 25: ఎంతో చరిత్ర కలిగిన సికింద్రాబాద్ గణపతి ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రోడ్డులోని గణనాథుడి ఆలయం నిర్మించి 200 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యేను వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసం లోకలిసి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఒదెల సత్యనారాయణ, సభ్యులు హన్మంతరావు, వినోద్‌కుమార్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బస్తీ సమస్యలు పరిష్కరిస్తాం

వినోబానగర్ బస్తీవాసులతో సమావేశమైన నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత

సికింద్రాబాద్, ఆగస్టు 25: తార్నాక డివిజన్ వినోబానగర్ బస్తీవాసులు ఆదివారం నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డిని వారి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. బస్తీలో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారికి వివరించారు. ఇందులో భాగంగా శ్మశానవాటికలో కల్పించాల్సిన వసతులు, రోడ్డు విస్తరణ, పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరారు, డిప్యూటీ మేయర్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, మహేశ్, జయ, నర్సింగ్‌రావు, రవీందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సహకారం అందించేందుకు కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ కృషి చేస్తుందని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఇటీవల నగరంలో దూల్‌పేట స్టేడియంలో జరిగిన కుస్తీ పోటీల్లో కంటోన్మెంట్‌కు చెందిన సాయి రాజేశ్‌యాదవ్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. ఆదివారం బోయిన్‌పల్లి క్రీడామైదానంలో రాజేశ్‌యాదవ్‌ను జంపన ప్రతాప్ సన్మానించారు. కార్యక్రమంలో కుస్తీ కోచ్ సాయిబాబయాదవ్, మధుకర్, రాజు యాదవ్, ముఖేశ్‌యాదవ్, ఓం ప్రకాశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.
– బొల్లారం

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి న గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందు తూ మృతి చెందాడు. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో చో టు చేసుకుంది. ఎస్ఐ ప్రవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...ఈ నెల 14న రాత్రి 8 గంటల ప్రాంతంలో కొంపల్లిలోని హిందూబాల పెట్రోల్‌బంక్ ముందు నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి(సుమారు 45)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని 108లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను ఆదివారం మృతి చెం దాడు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

రవీందర్‌నగర్ అధ్యక్షుడిగా విజయ్‌సింగ్

రవీందర్‌నగర్‌కాలనీ నూతన కార్యవర్గం

అమీర్‌పేట్, ఆగస్టు 25: సనత్‌నగర్ డివిజన్ రవీంద్ర్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా తాజా మాజీ అధ్యక్షుడు విజయ్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన పదవీ కాలంలో అధ్యక్షుడిగా తన వంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిన విజయ్‌సింగ్‌కే కాలనీవాసులు మరోసారి అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. ఆదివారం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. తనపై నమ్మకంతో రెండోసారి అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు. కాలనీ సమస్యలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని, భవిష్యత్తులో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డితో పాటు కాలనీ అభివృద్ధికి సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా ఎన్వీ రమణారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉమామహేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎన్.సుదర్శన్, కిరణ్ కోశాక్ మాథూర్, కోశాధికారిగా సి.రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా హనుమంతు కవిత నియమితులయ్యారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేసిన స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్‌కుమార్, పావని, సభ్యులు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 25: పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 259వ అన్నదానం నిర్వహించారు. అనాథలు, నిరాశ్రయులకు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని సభ్యులు హరీశ్, అఖిల్, సాయితేజ, సాయిరామ్, లోకేశ్ భోజనాన్ని అందజేశారు.

సంజీవ్‌నగర్‌కాలనీలో బోర్డు సభ్యుడి పర్యటన

సంజీవ్‌నగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

మారేడ్‌పల్లి, ఆగస్టు 25: సమాజంలో మంచి కోసం మార్పు మనతోనే మొదలవ్వాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. మీట్ యువర్ మెంబర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహేంద్రహిల్స్ సంజీవ్‌నగర్‌కాలనీలో పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా రోడ్డు, వరద నీటి కాలువ వల్ల అనేక ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంజీవ్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, ఆగస్టు 25: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన పలు ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో అలరించాయి. వివి ధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారుల కూచిపూడి, భరతనాట్య నృత్య రీతులు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో మంచిర్యాల శ్రీ శార్వాణి కూచిపూడి నృత్యాలయం నాట్య గురువు డాక్టర్ భార్గవి ప్రేమ్ శిష్య బృందం వినాయక కౌతం, స్వాగతం కృష్ణ, జతిస్వరం, కృష్ణ శబ్దం, దశావతార శబ్దం, స్వరజతి, కృష్ణ జనన శబ్దం, మంగళం అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించగా, రాశి సచిదానం దా శిష్య బృందం మల్లరి, గణేశా వందన, గురులేఖ కృతి, శ్యామలే మీనాక్షి, అర్ధనారీశ్వర స్తోత్రం, తిల్లాన అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

శిల్పకళా వేదికలో చేనేత వస్త్ర ప్రదర్శన

ప్రదర్శనను ప్రారంభిస్తున్న మిస్ యూనివర్స్ చందన

కొండాపూర్, ఆగస్టు 25 : చేనేత కారులను మరింత ప్రోత్సహించాలని మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ చందనా జయరాం అన్నారు. సోమవారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శనను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతీయ పట్టు, హ్యాండ్ లూమ్ వస్త్రాలకు ఎంతో ప్రత్యేకత ఉందని, చేనేతకారులను మరింతగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన వస్త్రాలను తిలకిస్తూ వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకన్నారు. ప్రదర్శన ఈ నెల 30 వరకు కొనసాగుతుందని, ఇందులో 14 రాష్ట్రాల నుంచి విచ్చేసిన చేనేతకారులు, హస్తకళా ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు జయేష్ గుప్తా అన్నారు.

నాణ్యతతో రహదారుల నిర్మాణం

మియాపూర్ , ఆగస్టు 25: ఆల్విన్ కాలనీ డివిజన్, నవోదయ కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును కార్పొరేటర్ వెంకటేశ్ ఆదివారం పరిశీలించారు. రహదారి క్యూరింగ్ చర్యలతో పాటు ఇరువైపులా మట్టి వేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో నాణ్యతతో రహదారుల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఖాళీ స్థలాల్లో చెట్లు నాటాలని ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రమణ, రాజిరెడ్డి, బాలస్వామి, గణేశ్, శివశంకర్, లక్ష్మణ్, మధన్, వాసు, కిశోర్, రాఘవ, శ్రీకాంత్, నాగేశ్వర్ రావు, అశోక్ , హరి, చందు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ ఆశయాలను సాధిద్దాం

బీపీ మండల్ జయంతి కార్యక్రమంలో వక్తలు

మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ తిరుమలి

ఖైరతాబాద్, ఆగస్టు 25 : దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీల స్థితిగతులను మార్చేందుకు తన తుది శ్వాస వరకు పోరాడిన బీపీ మండల్ ఆశయాలను సాధించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘం నేత సమ్మయ్య అధ్యక్షతన బీపీ మండల్ 106వ జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ తిరుమలి హాజరై మాట్లాడారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు ఇప్పటికీ అణిచివేతకు గురువుతున్నారని, 1993 వరకు జాతీయ స్థాయిలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. 2008 వరకు సెంట్రల్ యూనివర్సిటీ, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యాసంస్థల్లో బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ లేదన్నారు. సంపద సృష్టిస్తున్న వర్గాలకు అన్యాయం జరుగుతున్న విధానాన్ని గమనించిన బీపీ మండల్ ఉద్యమాల ఫలితంగానే బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలవుతున్నట్లు చెప్పారు. బీపీ మండల్ చేసిన సూచనలను ఇప్పటికీ అమలు చేయకుండా అగ్రవర్ణ పాలకులు కుట్రలు చేస్తున్నారన్నారు. బీసీలకు రిజర్వేషన్లు, రాజకీయ అధికారంపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను చేపట్టాలని తీర్మానించారు. చైతన్య కార్యక్రమాలను నిర్వహించేందుకు తెలంగాణ బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌ను ప్రారంభించారు.

విద్యతోనే బాలికలకు ఉజ్వల భవిష్యత్

గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

'టచ్ ఎ లైఫ్' స్కాలర్‌షిప్ డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థినులతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి

జూబ్లీహిల్స్, ఆగస్టు 25: బాలికలకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని.. 'టచ్ ఎ లైఫ్' సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సంస్థ నిర్వహించిన ఎడ్యుకేషన్ క్యాంప్‌లో పాల్గొని ఉచిత స్కాలర్‌షిప్ డ్రైవ్‌ను ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ.. ఎన్ని అవాంతరాలు వచ్చినా ప్రతి విద్యార్థిని లక్ష్యంతో చదువును కొనసాగించాలన్నారు. హైస్కూల్ చదువుతో విద్యను ఆపివేయకుండా చాలెంజింగ్ తీసుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని.. స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే అవగాహన కార్యక్రమాలలో పాల్గొంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లాలన్నారు. తద్వారా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుని పేద విద్యార్థినులకు చేయూత నివ్వాలని సూచించారు. 'టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్' నగరంలోని బస్తీలు, కాలనీలో నిరుపేద కుటుంబాలలో విద్యాభివృద్ధికి స్కాలర్‌షిప్ అందిస్తూ విశేషమైన సేవలందిస్తుందన్నారు.పోషకాహారం.. వ్యక్తిగత పరిశుభ్రత ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఎన్‌బీటీ నగర్‌లో ఉన్న విద్యార్థినుల కోసం స్థానికంగా ఇంటర్మీడియేట్ కళాశాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతితో కలిసి విద్యార్థినులకు న్యూట్రిషన్ హెల్త్, హైజిన్ కిట్లు అందించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ నేషనల్ కో – ఆర్డినేటర్ మహమ్మద్ ఖలీకర్ రెహ్మాన్, టచ్ ఎ లైఫ్ వ్యవస్థాపక సభ్యురాలు రీనా హిండోచ, విభూతి జైన్ పాల్గొన్నారు.

28న కీసర జోనల్ స్థాయి క్రీడలు ప్రారంభం

కీసర, ఆగస్టు 25: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఆధ్వర్యంలో కీసరలో జోనల్‌స్థాయి క్రికెట్ సెలక్షన్స్ ఈనెల 28న స్వామి నారాయణ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జడ్పీ ఉన్నత పాఠశాల కుషాయిగూడ పీడీ ప్రభాకర్ తెలిపారు. 14 నుంచి 17 సంవత్సరాల్లోపు బాలురకు శ్రీ స్వామి నారాయణ ఇంటర్నేషనల్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సెలక్షన్స్ కీసర,కాప్రా మండలాల్లో చదువుతున్న ప్రభుత్వ,ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులని 01-01-2011 తరువాత జన్మించిన వారు 14 సంవత్సరాల్లోపు 01-01-2008 తరువాత జన్మించిన వారు 17 సంవత్సరాల లోపు విభాగాలకు అర్హులని అన్నారు. ఆసక్తి గల క్రీడకారులు ఒర్జినల్ బోనఫైడ్, పాస్ ఫొటో అటెస్ట్,ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి ప్రతి విభాగంలో నలుగురు క్రీడకారులు మాత్రమే తమ సొంత కిట్‌తో హాజరు కావాలని సూచించారు. సెలెక్ట్ అయిన క్రీడాకారులు కీసర జోన్ తరుపున మేడ్చల్ జిల్లాస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. వయస్సు అర్హత కల్గిన జూనియర్ కాలేజీ విద్యార్థులు కూడా పాల్గొనవచ్చునని తెలిపారు.వివరాలకు డి. ప్రభాకర్ పీడీ కుషాయిగూడ ఉన్నత పాఠశాల ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రటరీ గారిని ఫోన్ నెంబర్ 9948263 609ను సంప్రదించాలని కోరారు.

అభాగ్యులకు ఆశ్రయం

జూబ్లీహిల్స్, ఆగస్టు 25: అభాగ్యులకు ఆశ్రయం కల్పించేందుకు జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. రోడ్ల వెంబడి ఫుట్‌పాత్, బస్ షెల్టర్లు, వ్యాపార సముదాయాల ఎదుట తలదాచుకుంటున్న వారికి ఆశ్రయం కల్పించేందుకు అర్బన్ కమ్యూనిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యూసుఫ్‌గూడ 19వ సర్కిల్ అధికారులు నిరాశ్రయుల వివరాలు సేకరించడంతో పాటు అప్పటికప్పుడు వాహనాల్లో పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. డీసీ సేవా ఇస్లావత్ ఆదేశాలతో యూసీడీ డీపీఓ వెంకటకిషన్‌రావు ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్ డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. నిరాశ్రయులను యూసుఫ్‌గూడలోని హోంనకు తరలించి ఆశ్రయం కల్పించారు.